సాక్షి
వికారాబాద్

బుధవారం, 31, మే, 2023



అన్నదాతల ఆక్రందన

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు అన్నదాతలు అనేక అగచాట్లు పడుతున్నారు.

8లో▶



తెరిచేదెప్పుడో?

లక్షలు వెచ్చించి నిర్మించిన దుకాణ సముదాయం అధికారుల నిర్లక్ష్యంతో అలంకారప్రాయంగా మారింది.

9లో▶



సంబురాలు అంబరాన్నంటాలి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు అంబరాన్నంటేలా నిర్వహించాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు.

9లో▶

న్యూస్‌రీల్

నేరస్తులు తప్పించుకోవద్దు

- ఎస్పీ కోటిరెడ్డి



కోట్‌పల్లి ఠాణాలో ఎస్పీ కోటిరెడ్డి

బంట్వారం: జిల్లాలో పెండింగ్ కేసులు లేకుండా చూడాలని ఎస్పీ కోటిరెడ్డి అన్నారు. కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రతీ కేసులోను నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు ఉండాలని ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ నేరస్తులు తప్పించుకోకుండా ఉండాలన్నారు. పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలన్నారు. చట్టాన్ని చేతిలోకి తీసుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రికార్డుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రతపై ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ సత్యనారాయణ, ధారూరు సీఐ అప్పయ్య, కోట్‌పల్లి ఎస్‌ఐ సత్యనారాయణరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్ డీఈ కరుణాకర్‌కు అదనపు బాధ్యతలు

తాండూరు రూరల్: తాండూరు, పెద్దేముల్ మండలాల పంచాయతీరాజ్ డీఈ వెంకట్రావ్ సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో యాలాల, బషీరాబాద్ మండలాల పీఆర్ డీఈ కరుణాకర్ చారికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. డీఈ వెంకట్రావ్ దాదాపు 24 రోజుల పాటు సెలవులో ఉంటారని తెలిసింది. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. తాండూరు, పెద్దేముల్ మండలాల్లో ఎస్‌డీఎఫ్ పనులను ప్రారంభించాలని ఆదేశించారు. బిల్లులు వంద శాతం వస్తాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

ముందస్తు అడ్మిషన్లకు కళ్లెం వేయండి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తాండూరు టౌన్: విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే కొనసాగుతున్న ముందస్తు అడ్మిషన్లకు కళ్లెం వేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం తాండూరు ఎంఈఓ వెంకటయ్యగౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సంఘం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యను వ్యాపార ధోరణితో చూస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాల యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డొనేషన్ల పేరుతో పేద, మధ్య తరగతి తల్లిదండ్రుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నరేష్, ఆంబోజి, వెంకట్, ప్రకాశ్ పాల్గొన్నారు.

అవతరణ వేడుకలపై ప్రత్యేక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ

పరిగి: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని డీపీఓ తరుణ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 21 రోజులు నిర్వహించే సంబరాల నేపథ్యంలో గ్రామాల్లో పండుగ వాతావరణం తీసుకురావాలని సూచించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాం, ఎలాంటి పథకాలు తీసుకువచ్చాం ప్రభుత్వం ఎలాంటి సేవలను ప్రజలకు అందిస్తోందనే విషయాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, అధికారులు దీపారెడ్డి, శేషగిరిశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

పరిగి: రాష్ట్ర సాధనలో ముందుండి పోరాడిన ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని టీజేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. జూన్ 2న ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు తీపికబురు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ మాట నిలబెట్టుకోవాలని కోరారు.

లక్ష్యం రూ.7,408 కోట్లు

- 2,74,895 మంది ఖాతాదారులకు వివిధ రకాల లోన్లు
- 2023- 24 వార్షిక రుణ ప్రణాళిక విడుదల
- గతేడాదితో పోలిస్తే రెండింతలు అధికం
- రుణ పరిమితి పెంచటంతోనే సరిపెడుతున్న ప్రభుత్వం
- వితరణలో చిత్తశుద్ధి పాటించని బ్యాంకర్లు



వార్షిక ప్రణాళికను విడుదల చేస్తున్న అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, అధికారులు, బ్యాంకర్లు

వికారాబాద్: వ్యవసాయ, ఇతర రంగాలకు ఇవ్వాల్సిన రుణ ప్రణాళికను (2023- 24 ఆర్థిక సంవత్సరం) బ్యాంకర్లు సిద్ధం చేశారు. ఏయే కేటగిరీలకు ఎంత మొత్తం లోన్లు మంజూరు చేయాలనే విషయంపై నివేదిక సిద్ధం చేసి కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి మంగళవారం రుణ ప్రణాళికను విడుదల చేశారు. గడిచిన త్రైమాసిక సమీక్షతో పాటు వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇవ్వాల్సిన రుణాలపై చర్చించారు. గతేడాది నిర్ధారించుకున్న లక్ష్యాలతో పాటు ఎంతమేర రుణ పంపిణీ చేశారనే విషయాలపై సమీక్షించారు. గతేడాది పెట్టుకున్న టార్గెట్‌ను పూర్తి చేయలేకపోయిన బ్యాంకర్లు ఈసారి అంతకన్నా ఎక్కువ రుణ పంపిణీ లక్ష్యాన్ని ప్రకటించడం గమనార్హం.

పంపిణీలో విఫలం

2022- 23 ఆర్థిక సంవత్సరంలో ప్రకటించిన లక్ష్యాలను చేరుకోవడంలో బ్యాంకులు విఫలమయ్యాయి. గతేడాది రూ.2,433.53 కోట్ల పంట రుణాలకు గాను రూ.1,847.32 కోట్లు మాత్రమే ఇచ్చారు. రైతులకు రూ.1,053.35 కోట్లకు రూ.568.35 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. మొత్తంగా వ్యవసాయ రుణాలకు సంబంధించి రూ.3,569 కోట్లు ఇవ్వాలని నిర్దేశించుకోగా రూ.2,523 కోట్లు ఇచ్చారు. ఎడ్యుకేషన్, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, స్వయం సహాయక సంఘాలకు రూ.5,692 కోట్ల పంపిణీ లక్ష్యం పెట్టుకోగా రూ.2,858 కోట్లు అందజేశారు.

లక్ష్యమే.. ఘనం!

వ్యవసాయ, అనుబంధ రంగాలతో పాటు ఇతర రంగాలను కలుపుకొని మొత్తం 2023- 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 2,74,895 మంది ఖాతాదారులకు రూ.7,408 కోట్ల రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో 1,78,522 మంది రైతులకు రూ.2,582 కోట్ల పంట రుణాలు, వ్యవసాయ, ఇతర రుణాలను కలుపుకొని 2,10,024 మంది రైతులకు రూ.3,829 కోట్ల రుణాల పంపిణీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. వీటితో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహకులకు మొత్తం 31,976 మంది ఖాతాదారులకు రూ.1,200 కోట్ల రుణాలు ఇవ్వనున్నారు. ఇతరత్రా ప్రాధాన్యతా రంగాలకు చెందిన 2,61,896 మందికి రూ.6,361 కోట్లు, ఇతర రంగాలకు చెందిన 19,896 మంది ఖాతాదారులకు రూ.1,331 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అప్రాధాన్యతా రంగాలకు చెందిన 12,999 మందికి రూ.1,046 కోట్ల రుణ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు.

ఈవీఎంలను సిద్ధం చేయండి

- జూన్ 22 వరకు మొదటి విడత పరిశీలన పూర్తి చేయాలి
- చెక్ చేసిన మిషన్లపై మాక్ పోలింగ్ నిర్వహించాలి
- సక్రమంగా పనిచేయని వాటిని వెనక్కి పంపించాలి
- కలెక్టర్ నారాయణ్‌రెడ్డి



ఈవీఎంల గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ

వికారాబాద్ అర్బన్: ఈవీఎంల మొదటి విడత పరిశీలన పనులను జూన్ 12 నుంచి 22 వరకు పూర్తి చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. వివిధ పార్టీల నాయకులతో కలిసి.. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం పక్కనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గోదాంను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. వచ్చే శాసన సభ ఎన్నికల సందర్భంగా జిల్లాలోని 1,130 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాడ్‌లు సక్రమంగా పనిచేస్తున్నాయా.. లేదా..? పరిశీలించాలన్నారు. మొదటి విడత పరిశీలనలో భాగంగా ఓటింగ్ యంత్రాలపై మాక్ పోలింగ్ నిర్వహించాలని సూచించారు. సక్రమంగా పనిచేయని మిషన్లను తిప్పి పంపిస్తామన్నారు. యంత్రాల మొదటి విడత పరిశీలనకు వచ్చే సిబ్బందికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఏ సమస్య ఎదురైనా ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని కళ్లకు కట్టండి

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు చూపించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరై జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించారు. పల్లె ప్రగతి ద్వారా గ్రామాలకు వచ్చిన నిధుల వివరాలను వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు జరిగిన లబ్ధికి సంబంధించిన వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలన్నారు. మాజీ ప్రజాప్రతినిధులు, పారిశుద్ధ్య పనుల్లో మెరుగైన సేవలందిస్తున్న కార్మికులను ఘనంగా సన్మానించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, జెడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీపీఓ తరుణ్‌కుమార్ పాల్గొన్నారు.



మెడల్, సర్టిఫికెట్ అందుకుంటున్న సాయికిరణ్

సాయికిరణ్‌కు గోల్డ్ మెడల్

- సీఎం కప్ విజేతగా హస్నాబాద్ విద్యార్థి
- రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం
- హర్షం వ్యక్తంచేస్తున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన విద్యార్థి సాయికిరణ్ మంగళవారం నిర్వహించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటి.. ప్రథమ బహుమతి (గోల్డ్ మెడల్) సాధించాడు. 16- 36ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా సాయికిరణ్ 7.26 కిలోల షాట్‌పుట్ విభాగంలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. ఇప్పటివరకు షాట్‌పుట్‌లో ఎన్నో బంగారు పతకాలు సాధించిన సాయికిరణ్ సీఎం కప్ గెలుచుకోవడం హర్షణీయమని గ్రామస్తులతోపాటు విద్యార్థి తల్లిదండ్రులు సురేష్‌కుమార్, శోభారాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతి బాపూలే బీసీ గురుకుల కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన సాయికిరణ్ గోల్డ్ మెడల్ సాధించడం ఆనందంగా ఉందన్నారు. సాయికిరణ్ మాట్లాడుతూ.. హెడ్ కోచ్ నాగపురి రమేష్(ద్రోణాచారి అవార్డు గ్రహీత), కోచ్ ఏఎస్.సాజి, పీఈటీ మహిపాల్, కోచ్ నాగరాజు, బీసీ గురుకుల డిప్యూటీ సెక్రటరీ తిరుపతిరెడ్డి, సెక్రటరీ మల్లయ్యభట్టు సహకారంతోనే గోల్డ్ మెడల్ సాధించానని తెలిపాడు.

మాఫీ కాకపాయె!

- ఏళ్లుగా ఎదురు చూస్తున్న రైతులు
- అప్పు చెల్లించాలని బ్యాంకర్ల ఒత్తిడి
- ఖాతాలను స్తంభింపజేస్తున్న వైనం
- ప్రభుత్వం స్పందించాలని కర్షకుల వేడుకోలు

కొడంగల్: గత ఎన్నికల్లో ప్రభుత్వం ఇచ్చిన రుణమాఫీ హామీ ఆచరణకు నోచుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. పంట రుణాల చెల్లింపు కోసం బ్యాంకర్ల నుంచి ఒత్తిడి పెరుగుతోందని చెబుతున్నారు. అంతటితో సరిపెట్టకుండా అధికారులు రైతుల ఖాతాలను స్తంభింపజేస్తున్నారు. అకౌంట్లలో ఉన్న డబ్బులను తీసుకునేందుకు వీల్లేకుండా హోల్డ్‌లో పెడుతున్నారు. కనీసం పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందజేస్తున్న రైతుబంధు డబ్బులు కూడా తీసుకునే వెసులుబాటు లేకుండా పోయిందని నిట్టూరుస్తున్నారు. దీంతో చేసేది లేక ప్రైవేటుగా అప్పులు తెచ్చి.. వడ్డీలు చెల్లించి ఖాతాలను పునరుద్ధరించుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం మొదటి దశ మాఫీ చేయాల్సిన రూ.25 వేలలోపు రుణాలను ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో మాఫీ చేయలేదు. రూ.50 వేలు అంతకన్నా ఎక్కువ రుణాలు తీసుకున్న వారి పరిస్థితి మరింత దయనీయంగా ఉంది.

నాలుగు దశల్లో రుణమాఫీ

రాష్ట్ర వ్యాప్తంగా 2018 డిసెంబర్ 11 నాటికి ఉన్న పంట రుణాల బకాయిలను రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా రూ.25 వేల లోపు పంట రుణాలు తీసుకున్న కొద్ది మందికి మాత్రమే రుణ మాఫీ చేశారు. మిగిలిన వారు మాఫీ కోసం ఎదురు చూస్తున్నారు. మొదటి దశలో రూ.25 వేలు, రెండో దశలో రూ.50 వేలు, మూడో దశలో రూ.75 వేలు, నాలుగో దశలో రూ.లక్షలోపు రుణాలు మాఫీ చేయాల్సి ఉన్నా .. ఇప్పటి వరకు మొదటి దశ కూడా పూర్తి కాలేదని రైతులు చెబుతున్నారు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించిన రుణ మాఫీ పథకం ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ఆదుకోని ప్రభుత్వం

కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, దౌల్తాబాద్, బొంరాస్‌పేట మండలాల్లోని ప్రాథమిక సహకార సంఘాలు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంకు, ఏపీజీవీబీ, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, మండల కేంద్రాల్లోని ఇతర బ్యాంకుల్లో వేలాది మంది రైతులు క్రాప్ లోన్స్ తీసుకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన నాలుగు దశల రుణమాఫీని వెంటనే వర్తింపజేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

రైతుబంధు కోసం ఎదురు చూపులు

వానాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటి వరకు రైతుబంధు డబ్బులను ఖాతాల్లో జమచేయ లేదని రైతులు అంటున్నారు. వర్షాలు కురిస్తే విత్తనాలు వేసేందుకు చేతిలో చిల్లి గవ్వ కూడా లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రైతుబంధు నిధులు విడుదల చేయాలని అభ్యర్థిస్తున్నారు.



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

మాఫీ చేయాలి



ప్రభుత్వం రుణమాఫీ చేసి రైతులను ఆదుకోవాలి. బ్యాంకుల్లో తీసుకున్న అప్పులను పూర్తి స్థాయిలో మాఫీ చేయాలి. సాధ్యమైనంత త్వరగా రైతుబంధు డబ్బులు ఇవ్వాలి. అకాల వర్షాలకు నష్టపోయిన పంటలకు వెంటనే పరిహారం చెల్లించాలి.

– చుక్కయ్య, రైతు కొడంగల్



రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్, చిత్రంలో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మరో పదిహేనేళ్లు మాదే అధికారం

- సీఎం కేసీఆర్ నేతృత్వంలో అన్ని విధాలా అభివృద్ధి
- దేశంలోనే నంబర్ వన్ స్థానం
- సంక్షేమ పాలన బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం
- సంక్షేమం కావాలో.. సంక్షోభం కావాలో ప్రజలే తేల్చుకోవాలి
- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

షాద్‌నగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం మరో 15 ఏళ్లు అధికారంలో ఉండటం ఖాయమని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో రూ.161.73 కోట్లతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మంగళవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ నేతృత్వంలో అభివృద్ధిలో దేశంలోనే నంబర్ వన్ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి అభివృద్ధి పథకాలను చేపడుతున్నారని తెలిపారు. ప్రజల కష్టాలు తొలగాలన్నా, బాధలు పోవాలన్నా, సంక్షేమ పాలన కొనసాగాలన్నా అది బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్న సీఎం కేసీఆర్ పాలన కావాలో, రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టేసే కాంగ్రెస్, బీజేపీ పాలన కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. సమైక్య పాలనలో తెలంగాణను చిన్నచూపు చూశారని, ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొట్లాడి సాధించుకున్న ప్రత్యేక రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అభివృద్ధి చేసేందుకు అహర్నిషలు శ్రమిస్తున్నారని కొనియాడారు. సమావేశంలో ఎమ్మెల్సీ వాణీదేవి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భీష్మ కిష్టయ్య, వాల్యా నాయక్, రామకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, రవీందర్ యాదవ్, మురళీ యాదవ్, రాజావరప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రభుత్వం అండ

- జిల్లా యువజన క్రీడాధికారి వెంకటేశ్వర్‌రావు
- కొనసాగుతున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలు

హుడాకాంప్లెక్స్: ప్రభుత్వం క్రీడలు, క్రీడాకారులకు అండగా నిలుస్తుందని జిల్లా యువజన క్రీడాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సీఎం కప్–2023 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను మంగళవారం సరూర్‌నగర్ స్టేడియంలో ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మూడు రోజులుగా వాలీబాల్, కబడ్డీ, జిమ్నాస్టిక్స్ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బుధవారం ఫైనల్స్ ఉంటాయని వివరించారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రవికుమార్, జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ కార్యదర్శి బాలరాజు, స్వర్ణలత, సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు.

విజేతలు వీరే ..

వాలీబాల్ (పురుషుల విభాగం): ములుగు- భువనగిరి తలపడగా ములుగు, వికారాబాద్- సూర్యాపేట పోటీపడగా వికారాబాద్, ఆదిలాబాద్- హనుమకొండ పోటీలో ఆదిలాబాద్, రంగారెడ్డి- సిరిసిల్ల మ్యాచ్‌లో రంగారెడ్డి, జనగాం - సిద్దిపేట తలపడగా జనగాం, యాదాద్రి- మేడ్చల్ పోటీలో యాదాద్రి, వికారాబాద్- గద్వాల మ్యాచ్‌లో వికారాబాద్, నారాయణపేట- నల్లగొండ మధ్య జరిగిన పోటీలో నారాయణపేట, జగిత్యాల- నాగర్‌కర్నూల్ తలపడగా జగిత్యాల, పెద్దపల్లి- హనుమకొండ మ్యాచ్‌లో పెద్దపల్లి, కరీంనగర్- నల్లగొండ పోటీలో కరీంనగర్, వనపర్తి- నిర్మల్ తలపడగా వనపర్తి, మహబూబాబాద్- కొమురం భీం మ్యాచ్‌లో మహబూబాబాద్ జిల్లా జట్లు గెలుపొందాయి.



కబడ్డీలో తలపడుతున్న మహిళా క్రీడాకారులు

వాలీబాల్ (మహిళల విభాగం): వరంగల్- మంచిర్యాల తలపడగా వరంగల్, హైదరాబాద్- కొత్తగూడెం మ్యాచ్‌లో హైదరాబాద్, కరీంనగర్- నాగర్‌కర్నూల్ పోటీలో కరీంనగర్, కొత్తగూడెం- హనుమకొండ మ్యాచ్‌లో కొత్తగూడెం, మహబూబాబాద్- మహబూబ్‌నగర్ తలపడగా మహబూబాబాద్, గద్వాల- జగిత్యాల ఆడగా గద్వాల, నాగర్‌కర్నూల్- భువనగిరి పోటీలో నాగర్‌కర్నూల్, వికారాబాద్- భూపాలపల్లి తలపడగా వికారాబాద్, సూర్యాపేట- మెదక్ పోటీలో సూర్యాపేట, వనపర్తి- హనుమకొండ మధ్య వనపర్తి, మహబూబాబాద్- హనుమకొండ పోటీపడగా మహబూబాబాద్, జనగాం-గద్వాల మ్యాచ్‌లో జనగాం, సంగారెడ్డి- సిరిసిల్ల పోటీలో సంగారెడ్డి, నిజామాబాద్- సిద్దిపేట మధ్య జరిగిన పోటీలో నిజామాబాద్ జట్లు విజయం సాధించాయి.

కబడ్డీ (మహిళా విభాగం): నిజామాబాద్- కొత్తగూడెం తలపడగా కొత్తగూడెం, ఆదిలాబాద్- వనపర్తి పోటీలో ఆదిలాబాద్, నల్లగొండ- ములుగు మ్యాచ్‌లో నల్లగొండ, సూర్యాపేట- మంచిర్యాల పోటీపడగా సూర్యాపేట, జనగాం- నాగర్‌కర్నూల్ మ్యాచ్‌లో జనగాం, రంగారెడ్డి- మహబూబాబాద్ తలపడగా రంగారెడ్డి, హనుమకొండ- కామారెడ్డి పోటీలో కామారెడ్డి, ఖమ్మం-హైదరాబాద్ మధ్య జరిగిన పోటీలో ఖమ్మం, వరంగల్- మేడ్చల్ పోటీలో మేడ్చల్, కొత్తగూడెం- ఆదిలాబాద్ పోటీపడగా కొత్తగూడెం, వనపర్తి- వికారాబాద్ మధ్య సాగిన పోటీలో వనపర్తి, మహబూబ్‌నగర్- జగిత్యాల తలపడగా మహబూబ్ నగర్ జట్లు విజేతలుగా నిలిచాయి.

కబడ్డీ (పురుషుల విభాగం): గద్వాల- నారాయణపేట మధ్య గద్వాల, రంగారెడ్డి- కొత్తగూడెం తలపడగా రంగారెడ్డి, నల్లగొండ- వనపర్తి పోటీలో నల్లగొండ, మేడ్చల్- ఖమ్మం పోటీలో మేడ్చల్, సూర్యాపేట- సంగారెడ్డి మ్యాచ్‌లో సూర్యాపేట, యాదాద్రి- సిద్దిపేట తలపడగా యాదాద్రి, జనగాం- హైదరాబాద్ జట్లు పోటీపడగా జనగాం, సిరిసిల్ల- జగిత్యాల మధ్య సాగిన పోటీలో సిరిసిల్ల, వరంగల్- జగిత్యాల తలపడగా వరంగల్, ములుగు- పెద్దపల్లి పోటీపడగా ములుగు జట్లు విజయం సాధించాయి. మ్యాచ్‌లు ఉత్కంఠగా సాగాయి.

క్లుప్తంగా

కలప ట్రాక్టర్ పట్టివేత

దోమ: అక్రమంగా కలప తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్‌ఐ విశ్వజన్ తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన మల్లేశ్ అనే వ్యక్తి తన ట్రాక్టర్‌లో అక్రమంగా కలపను తరలిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. వాహనానికి సంబంధించిన ధ్రువ పత్రాలు, కలప అనుమతి పత్రాల గురించి డ్రైవర్‌ను ప్రశ్నించగా, అతని వద్ద ఎలాంటి పేపర్లు లేవు. దీంతో ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

కల్తీ పాల విక్రేత అరెస్టు

800 లీటర్ల పాలు సీజ్

మంచాల: కల్తీ పాలు తయారు చేసి విక్రయిస్తున్న ఓ పాల వ్యాపారిని పోలీసులు అరెస్టు చేశారు. మంచాల ఎస్‌ఐ రామన్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. జాపాల గ్రామానికి చెందిన సయ్యద్ హైమద్ కొన్ని రోజులుగా పాలలో హైడ్రోజన్ పెరాక్సైడ్ కలిపి విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు మంగళవారం దాడి చేసి 800 లీటర్ల పాలను సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేశారు. పాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్ పంపామని.. ఫలితాల్లో మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

విత్తనాల దుకాణాలపై విజిలెన్స్ దాడులు

- ప్యాకింగ్‌లేని సీడ్స్ సీజ్
- షాపుల యజమానులపై కేసు

చేవెళ్ల: నకిలీ విత్తనాల విక్రయాలను కట్టడి చేసేందుకు విజిలెన్స్, వ్యవసాయాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సోమ, మంగళవారం నిర్వహించిన ఈ తనిఖీల్లో ప్యాకింగ్ లేకుండా అమ్ముతున్న విత్తనాలు సీజ్ చేసి మూడు దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేశారు. విజిలెన్స్ అధికారి రఘురాం, విజిలెన్స్ సీఐ చంద్రమోహన్, చేవెళ్ల వ్యవసాయాధికారి తులసి తెలిపిన ప్రకారం.. రెండు రోజులుగా చేపట్టిన తనిఖీల్లో అయ్యప్ప ఫెర్టిలైజర్, రాఘవేంద్ర హోల్‌సేల్ దుకాణం, మరో సంచుల దుకాణంలో ప్యాకింగ్ లేకుండా లూజ్‌గా విత్తనాలు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. మెంతులు, ధనియాలు, పాలకూర, తోటకూర, గోంగూర తదితర ఆకుకూర విత్తనాలు తనిఖీల్లో పట్టుబడ్డాయి. వీటిని సీజ్ చేసి పోలీసులకు అప్పగించామని చెప్పారు. లైసెన్సులు లేకుండా ప్యాకింగ్‌లేని విత్తనాలు విక్రయాలు చేపట్టడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ సందర్భంగా మూడు దుకాణాల యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు ఉపయోగపడేలా 'కాలేజీ అడ్మిషన్స్ డీకోడెడ్'

మంత్రి సబితారెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సబితారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: అడ్మిషన్స్ సమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు సరైన నిర్ణయం తీసుకునేందుకు కాలేజ్ అడ్మిష్షన్స్ డీకోడెడ్ పుస్తకం ఉపయోగ పడుతుందని మంత్రి సబితారెడ్డి అన్నారు. మంగళవారం ఆమె ప్రముఖ విద్యావేత్త, రచయిత ఎస్.సుధీర్‌రెడ్డి రచించిన కాలేజ్ అడ్మిష్షన్స్ డీకోడెడ్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డిని ఆమె అభినందించారు. రచయిత సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంసెట్‌తో సహా వివిధ పోటీ పరీక్షలకు హాజరైన వారు తదుపరి చేరాల్సిన కోర్సులు, కళాశాలలు లాంటి వివరాలతో బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకునేందుకు ఈ పుస్తకం దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేమిరెడ్డి నర్సింహారెడ్డి, ఎస్.చెన్నారెడ్డి, మల్లారెడ్డి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ టీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల ఆక్రందన



తాండూరు రూరల్: ఖాంజాపూర్ గేటు వద్ద ఆందోళన చేస్తున్న రైతులు



ఉన్నతాధికారులకు సమస్యను వివరిస్తున్న తహసీల్దార్ చిన్నప్పల నాయుడు

- తాండూరు–హైదరాబాద్ రోడ్డుపై బైఠాయించిన రైతులు
- వరిధాన్యం అన్‌లోడింగ్ జాప్యంపై కర్షకుల కన్నెర్ర

తాండూరు రూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు అన్నదాతాలు అనేక అగచాట్లు పడుతున్నారు. తెచ్చిన దిగుబడి అన్‌లోడింగ్ కాకపోవడంతో గోదాంల వద్ద నాలుగైదు రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. అయినా.. అధికారులు పట్టించుకోకపోవడంతో అన్నదాతలు ఆక్రోశంతో ఆందోళన బాటపట్టారు. మంగళవారం తాండూరు మండలంలోని ఖాంజాపూర్ గేటు వద్ద హైదరాబాద్–తాండూరు రోడ్డుపై రైతులు బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతు ప్రభుత్వం అని గొప్పలు చెప్పి.. రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. గోదాంల వద్ద ధాన్యం దిగుమతి విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ రైతులు దేవరఫసల్‌వాద్ గ్రామంలో ఆందోళనలు చేపట్టారు. గ్రామంలోని రైస్‌మిల్లుకు కొనుగోలు కేంద్రం నుంచి తెచ్చిన వరిని కొనుగోలు చేయాలని ఆదేశాలు ఉన్నప్పటికీ మిల్లు యజమాని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. మూడు రోజుల నుంచి తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువస్తే అక్కడి నిర్వాహకులు లారీల కొరత సాకుతో.. రైస్‌మిల్లుకు తీసుకెళ్లాలని సూచించారు. రైస్‌మిల్లుకు వస్తే.. వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి త్వరగా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

వర్గపోరుపై ఉన్న దృష్టి.. రైతులపై లేదా?

పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్

ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డికి వర్గపోరుపై ఉన్న దృష్టి.. అన్నదాతాలపై లేదని, ఇద్దరు నాయకులు వారి స్వార్థం కోసం పని చేస్తున్నారని పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్, రాష్ట్ర జనరల్ సెక్రటరి, పెద్దేముల్ జెడ్పీటీసీ ధారాసింగ్, మల్కాపూర్ జనార్దన్‌రెడ్డి మండిపడ్డారు. రైతుల ధర్నాకు మద్దతు తెలిపిన ఆయన మాట్లాడారు. వద్ద ధాన్యం విక్రయించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారని, వారి బాధలు ఎవరు కూడా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపటి లోగా గోదాం వద్ద అన్‌లోడింగ్ చేయకపోతే తాండూరులో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ధాన్యానికి నిప్పు పెట్టి నిరసన



బొంపల్లిలో రోడ్డుపై ధాన్యానికి నిప్పంటించి ధర్నా చేస్తున్న రైతులు

దోమ: ధాన్యం కొనుగోళ్లలో అధికారుల నిర్లక్ష్యానికి రైతులు రోడ్డెక్కారు. దోమ మండలం బొంపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు ఆందోళన చేశారు. పరిగి–మహబుబ్‌నగర్ ప్రధాన రహదారిపై బైఠాయించి ధాన్యానికి నిప్పు పెట్టి ధర్నా చేశారు. ధాన్యం కొనుగోళ్లలో అధికారులు పూర్తిగా విఫలం అవుతున్నారని, కొనుగోలు కేంద్రాల్లో లారీలు, గన్నీబ్యాగుల కొరత ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని రైతులు మండిపడ్డారు. ఇదిలా ఉండగా.. రెండు గంటల పాటు రైతులు ధర్నా నిర్వహించడంతో ఘటనా స్థలానికి డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్, ఎస్‌ఐ విశ్వజన్ చేరుకొని రైతులకు నచ్చచేప్పే ప్రయత్నం చేశారు. రైతులు ససేమిరా అనడంతో ఉన్నతాధికారులతో మాట్లాడి లారీ లు, గన్నీబ్యాగుల కొరత తీరేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

నాలుగు రోజులు అయినా..



నాకున్న నాలుగు ఎకరాల్లో వరిసాగు చేశాను. దిగుబడి 230 బస్తాల వరిధాన్యాన్ని రెండు ట్రాక్టర్లతో ఖాంజాపూర్ గేటు వద్ద ఉన్న గోదాంకు తీసుకు వచ్చాను. తూకం చేసుకొని, అన్‌లోడింగ్ కోసం వస్తే నాలుగు రోజులు అయినా దిగుమతి చేసుకోవడం లేదు. కనీసం తాగటానికి నీరు లేదు. – వాజిద్, రైతు, కందనెల్లి

గోదాంకు ధాన్యం తీసుకురావొద్దు

తాండూరు, పెద్దేముల్ మండలంలోని రైతులు ఎవరూ కూడా ఖాంజాపూర్ గేటు వద్ద ఉన్న గోదాంకు ధాన్యాన్ని తీసుకురావొద్దు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు మాత్రమే తీసుకెళ్లాలి. అక్కడే తూకం చేసి.. అక్కడి నుంచి లారీల్లో మిల్లులకు తరలిస్తాం. – చిన్నప్పల నాయుడు, తహసీల్దార్, తాండూరు మండలం

భార్యతో గొడవపడిన వ్యక్తి అదృశ్యం

పహాడీషరీఫ్: భార్యతో గొడవపడిన వ్యక్తి అదృశ్యమైన ఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కె.మధుసూదన్ తెలిపిన ప్రకారం.. నాదర్‌గుల్‌లోని ఇంద్రానగర్‌కు చెందిన స్వప్న మోని శైలజ, నర్సింహ దంపతులు. ఏప్రిల్ 29న దంపతుల మధ్య గొడవ జరిగి నర్సింహ భార్యపై చేయిచేసుకున్నాడు. దీంతో ఆమె పిల్లలతో కలిసి జల్‌పల్లిలో శ్రీరాం కాలనీలో నివాసం ఉండే సోదరి ఇంటికి వెళ్లింది. నర్సింహ అక్కడికి వెళ్లి మరోసారి గొడపడి వెళ్లిపోయాడు. రెండు రోజుల తర్వాత భార్య వచ్చిచూడగా కనింపించలేదు. గతంలో గొడవపడినపుడు ఇంట్లోనుంచి వెళ్లి తిరిగి వచ్చేవాడు. నెల రోజులైనా తిరిగి రాకపోవడం.. ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో భార్య మంగళవారం పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గానీ 87126 62367 నంబర్‌కు గానీ సమాచారం అందించాలని కోరారు.

పిట్టలగూడలో యువకుడు..

నందిగామ: సెల్‌ఫోన్ ఇంట్లో పెట్టి బయటకు వెళ్లిన యువకుడు నెలరోజులైనా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. నందిగామ ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపిన ప్రకారం.. మండల కేంద్రం నందిగామ అనుబంధ గ్రామం పిట్టలగూడకు చెందిన మామిళ్లపల్లి అనిల్(22) ఏప్రిల్ 30న మొబైల్ ఇంట్లో పెట్టి ఎవరికీ చెప్పకుండా బైక్‌పై బయటకు వెళ్లాడు. నాటి నుంచి ఎక్కడ వెతికినా యువకుడి ఆచూకీ లభించలేదు. దీంతో అనిల్ తండ్రి మంగళవారం శంకరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రామయ్య తెలిపారు.

ఉపాధి కోల్పోయాం..



తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న గౌడసంఘం నాయకులు

200 ఈత చెట్లు నరికేశారు

మర్పల్లి: కులవృత్తుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుండగా.. రియల్ వ్యాపారం పేరుతో కొందరు వారి నష్టానికి కారకులవుతున్నారు. మండల పరిధిలోని మొగిలిగుండ్ల గ్రామంలో ఈత చెట్లను నరికి వేసి గీతాకార్మికులు ఉపాధి కోల్పోయేలా చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సర్వే నంబర్ 55,56,57,58లో సదరు భూమి యజమాని సుమారు రెండు వందల ఈత చెట్లను ఈ నెల 28న రాత్రి జేసీబీలతో పీకేసినట్లు గీతాకార్మికలు ఆరోపించారు. నాటి నుంచి ఈత చెట్లను గీసి ఉపాధి పొందుతున్నామని, ఆ చెట్లను నరికి వేయడంతో తాము ఉపాధి కోల్పోయామని వాపోయారు. ఈ మేరకు తహసీల్దార్ శ్రీధర్‌కు, మర్పల్లి ఎక్సైజ్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశామని నాయబ్‌గౌడ్ తెలిపారు. ఇదే విషయమై తహసీల్దార్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ఈత చెట్లను సంగారెడ్డి జిల్లా సదాశివపేట్‌కు చెందిన బజాజ్ పవన్ అనే భూ యజమాని పీకేసినట్లు తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పారు.

ప్రాణం తీసిన ఈత సరదా



తాడు సాయంతో బావిలోంచి శవాన్ని తీస్తున్న స్థానికులు

మోమిన్‌పేట: ఈత సరదా ప్రాణం తీసింది. ఈత నేర్చుకునేందుకు వెళ్లిన ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మోమిన్‌పేటలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్ తెలిపిన వివరాల ప్రకారం.. రావులపల్లి గ్రామానికి చెందిన గారెల గోవర్ధన్(25) సోమవారం ఉదయం గారెల యాదయ్య, అభిలాష్‌తో కలిసి ఈత నేర్చుకునేందుకు గారెల యాదయ్య వ్యవసాయ బావి వద్దకు వెళ్లారు. మతుడు గోవర్ధన్ నడుముకు 5లీటర్ల ఖాళీ వాటర్ క్యాన్ కట్టుకొని బావిలోకి దూకాడు. దూకిన వెంటనే నడుముకు కట్టుకున్న క్యాన్ ఊడిపోవడంతో నీటిలో మునిగిపోయాడు. ఇది గమనించిన అభిలాష్, యాదయ్యలు కాపాడే ప్రయత్నం చేశారు. కానీ గోవర్ధన్ నీటిలో మునిగి చనిపోయాడు. మృతుడి తల్లి పద్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్నా హజారే వర్సిటీలో రైతుల బృందం పర్యటన



వ్యవసాయ క్షేత్రం పరిశీలిస్తున్న హజారే

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం పరిధిలోని 60 మంది రైతులతో కూడిన బృందం సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో స్టడీ టూర్‌లో నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం మహారాష్ట్రలోని రాలేగావ్ సిద్ధి గ్రామంలో ఉన్న అన్నా హజారే వ్యవసాయ ఇనిస్టిట్యూట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు అన్నా హజారేతో కలిసి వ్యవసాయ క్షేత్రంలో పర్యటిస్తూ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

'ప్రజాగర్జన'ను విజయవంతం చేయండి



గుడిసె వాసులతో మాట్లాడుతున్న రామస్వామి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి

చేవెళ్ల: ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ఆధ్వర్యంలో భద్రాద్రి నిర్వహిస్తున్న ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని భూ పోరాట కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారం, సింగరేణి తదితర ప్రభుత్వ రంగ పరిశ్రమల రాజ్యాంగ, లౌకిక, వ్యవస్థల పరిరక్షణకు సీపీఐ ఆధ్వర్యంలో ఈ సభ నిర్వహిస్తోందన్నారు. కార్మికులు, కర్షకులు, రైతులు ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరైన సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. 107 రోజులుగా భూపోరాట కేంద్రంలతో ఇళ్లు లేని పేదలు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాలె యాదయ్య స్పందించి వారికి కనీస వసతులు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పార్టీ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, మొయినాబాద్ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, గండిపేట్ మండల కార్యదర్శి బాబురావు, నాయకులు శ్రీను, సాయిలమ్మ, మాధవి, విజయమ్మ, అమృత తదితరులు పాల్గొన్నారు.

వంతెనపై తేలిన ఇనుప రాడ్లు

- ఇబ్బంది పడుతున్న వాహనదారులు

ప్రారంభం కాకముందే శిథిలం!



బుద్దారం వంతెనపై తేలిన ఇనుప రాడ్లను చూపిస్తున్న వాహనదారులు

పెద్దేముల్: మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రహదారులు, వంతెనల నిర్మాణాల కోసం వేల కోట్ల రూపాయాలు వెచ్చిస్తున్నా సమస్యలు తీరడం లేదు. బొంబాయి హైవే రోడ్డుకు లింక్ ఉన్నా, తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారిపై పెద్దేముల్ మండలం బుద్ధారం కల్వర్టుపై వంతెన నిర్మించారు. కానీ.. ప్రారంభానికి ముందే రాడ్లు తేలి ప్రమాదకరంగా తయారైంది. దీంతో వాహనదారులకు ఇబ్బంది తప్పడం లేదు. రాత్రి వేళలో ఏ మాత్రం ఏమరుపాటున వాహనం నడిపినా అంతే సంగతులు అని, దీనికి కారణం బ్రిడ్జి నిర్మాణ పనులు నాసిరకమే అని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రారంభం కాకముందే వంతెన ఇలా శిథిలావస్థను తలపిస్తుందని, అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే బ్రిడ్జి పనులు నాసికరంగా జరిగాయని వాపోతున్నారు. ఈ రహదారిపై నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు తిరుగుతుంటాయి. ఇలా వంతెనపై ఇనుప కడ్డీలు తేలి ప్రమాదకరంగా మారినా.. ఆర్‌అండ్‌బీ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. వంతెన నాసిరకంపై సర్పంచులు, ఎంపీటీసీలు మండల సర్వసభ్య సమావేశంలో లేవనెత్తారు. ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డిలకు చెప్పారు. అయినా ఫలితం శూన్యమని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇనుప చువ్వలు తేలిన చోట మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపన పూజలు

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

శంకర్‌పల్లి: ప్రతీ ఒక్కరు ఆధ్యాత్మిక భావన పెంపొందించుకోవాలని మాధవానంద సరస్వతిస్వామి, అద్వయా నరేంద్ర సరస్వతి స్వామి భక్తులకు సూచించారు. పట్టణంలో నూతనంగా నిర్మించిన అయ్యప్ప ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు మూడు రోజులుగా వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ప్రతిష్ఠాపన విగ్రహాలకు, యంత్ర పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సమితి సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ సాత ఆత్మలింగం, సభ్యుడు జూలకంటి వెంకట్‌రెడ్డి భక్తులకు అన్నదానం చేశారు.



మూలమూర్తులకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ప్రాణం తీసిన పొలం పంచాయితీ



ఆందోళనకారులతో మాట్లాడుతున్న సీఐ బాలరాజు



స్టేషన్ ఎదుట రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

- తమ్ముడికి తెలియకుండా పొలం విక్రయించిన అన్న
- న్యాయం చేయాలని కొనుగోలుదారుడిని కోరిన శంకర్‌నాయక్
- స్పందించక పోవడంతో బలవన్మరణం

కొత్తూరు: తండ్రి వారసత్వంగా వచ్చిన భూమి వాటా విషయంలో అన్యాయం జరిగిందని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొడిచర్ల తండాలో మంగళవారం చోటు చేసుకుంది. సీఐ బాలరాజు తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన లక్ష్మణ్‌నాయక్, శంకర్‌నాయక్(43) అన్నదమ్ములు. వారి తండ్రి పేరుమీద ఉన్న 23 గుంటల భూమికి లక్ష్మణ్‌నాయక్ పేరిట పట్టాపాస్ బుక్ వచ్చింది. ఈ పొలాన్ని లక్ష్మణ్‌నాయక్ పదేళ్ల క్రితం పీర్యానాయక్ అనే వ్యక్తికి విక్రయించాడు. ఇటీవల విషయం తెలుసుకున్న శంకర్‌నాయక్ కొనుగోలుదారుడిని ఫోన్‌లో తనకు రావాల్సిన వాటా విషయంలో అన్యాయం జరిగిందని.. న్యాయం చేయాలని కోరాడు. అందుకు ఆయన స్పందించకపోవడంతో తండా శివారులో పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన పక్క పొలం వారు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కాగా మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు శంకర్‌నాయక్ చావుకు పీర్యానాయక్ కారణమని ఆరోపిస్తూ పీఎస్ వద్ద ఆందోళనకు దిగారు. పీర్యానాయక్ ఓ అత్యున్నత శాఖలో ప్రభుత్వ అధికారిగా విధులు నిర్వహిస్తున్నాడన్నారు. న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించేది లేదని భీష్మించుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ ఫలాలు

'శుభోదయం'లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మురుగు కాల్వలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, జెడ్పీటీసీ అవినాష్‌రెడ్డి

షాబాద్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి చేరుతున్నాయని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హైతాబాద్, అంకుగూడ, హైతాబాద్ తండా గ్రామాల్లో ఆయన జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాష్‌రెడ్డితో కలిసి శుభోదయం కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎవరి ప్రమేయం లేకుండానే సంక్షేమ పథకాలన్ని నేరుగా అందుతున్నాయని ప్రజలు ఆనందంగా వివరిస్తున్నారని చెప్పారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ ఇంటికి తాగునీరు చేస్తున్నామన్నారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు నిర్మాణం, విద్యుత్ సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని చెప్పారు. ఆ సమస్యలు తర్వలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, గ్రామ సర్పంచ్ మల్లేశ్, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు చాంద్‌పాషా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు నక్క శ్రీనివాస్‌గౌడ్, వెంకటయ్య, ఎంపీటీసీ సభ్యురాలు జయమ్మ, మాజీ సర్పంచ్ దర్శన్, ఉపసర్పంచ్ గోపాల్, ఎంపీడీఓ అనురాధ, ఏఈలు శ్రీదివ్య, శారద, లక్ష్మన్‌నాయక్, ఏపీఓ వీరాసింగ్, ఏపీఎం నర్సింహులు, బీఆర్ఎస్ నాయకులు భూపాల్‌రెడ్డి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.